# సాక్షి
## అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం ǀ 24 ǀ మార్చి ǀ 2023




**సంతల్లో సౌకర్యాలు**

దుకాణాల నిర్వహణకు షెడ్లను నాబార్డు సాయంతో నిర్మిస్తున్నామని నాబార్డ్ ఏజీఎం శ్రీనివాసరావు తెలిపారు.

8లో



**విద్యార్థులకు సికిల్‌సెల్ పరీక్షలు**

హుకుంపేట: బాకూరు ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో 182 మందికి సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.



**కూలిన వృక్షం తొలగింపు**

రాజవొమ్మంగి–ఏలేశ్వరం మార్గంలో ఉర్లాకులపాడు వద్ద రోడ్డుపై కూలిన వృక్షాన్ని తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు.

**రంజాన్ వేళలు**

| ఇఫ్తార్ (శుక్ర) | సహర్ (శని) |
|---|---|
| అల్లూరి 6-13 | 4-42 |

# పోషణ సంపూర్ణం

- అంగన్‌వాడీ కేంద్రాల్లో సంపూర్ణ పోషణ ప్లస్ పక్కాగా అమలు
- గర్భిణులు, బాలింతలకు పూర్తిస్థాయిలో పౌష్టికాహారం
- ప్రత్యేక కిట్‌లో ఐదు రకాలు
- తల్లీబిడ్డల సంక్షేమమే లక్ష్యం



అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనం చేస్తున్న చిన్నారులు

సాక్షి,పాడేరు: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల నుంచి అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ పోషణ ప్లస్ పథకం మంచి ఫలితాలనిస్తోంది. గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో పౌష్టికాహారాన్ని మధ్యాహ్న భోజనంగా అందిస్తోంది. చిన్నారులకు అదనంగా పౌష్టికాహారం అందిస్తున్నారు. ఏడవ నెల శిశువు నుంచి ఆరేళ్ల చిన్నారి వరకు వారి ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. వారిలో రక్తహీనత నివారణలో కీలక పాత్ర పోషిస్తోంది.

- అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన బియ్యాన్ని ప్రభుత్వం సరఫరా చేస్తోంది.
- ఆకుకూర, పప్పు వంటకాలతో కూడిన భోజనం పక్కాగా అందేలా ఐసీడీఎస్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.
- రోజువారి పౌష్టికాహారం పంపిణీ ఫొటోలను ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తున్నారు.
- చిన్నారులకు పాలు, గుడ్డు, మధ్యాహ్నం భోజనం వడ్డించడం వల్ల ప్రీస్కూల్‌కు ఆదరణ పెరుగుతోంది.
- అంగన్‌వాడీ కేంద్రాలకు రాలేని గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వ ఆదేశాల మేరకు టేక్ హోం రేషన్‌ను అమలు చేస్తున్నారు.

**అదనంగా పౌష్టికాహార కిట్**

వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్‌లో భాగంగా గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేకంగా గర్భిణులు, బాలితలకు అదనంగా పౌష్టికాహార కిట్‌ను ప్రతి నెలా పంపిణీ చేస్తున్నారు. రెండు కిలోల మల్టీగ్రయిన్ అట్ట, రెండు కిలోలు, వేరుశెనగ పలుకులు, 500 గ్రాములు బెల్లం చక్కీలు, రోడి లేదా జొన్నపిండి 500 గ్రాములు, బెల్లం 500 గ్రాములు, ఎండు ఖర్జూరం 500 గ్రాములు కిట్‌గా పంపిణీ చేస్తున్నారు.

**జిల్లా సమాచారం**

| | |
|---|---|
| అంగన్‌వాడీ కేంద్రాలు | : 3214 |
| మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు | : 1791 |
| మినీ అంగన్‌వాడీ కేంద్రాలు | : 1423 |
| గర్భిణులు | : 11,031 |
| బాలింతలు | : 11,017 |
| ఏడు నెలలు, మూడేళ్ల లోపు చిన్నారులు | : 57,027 |
| మూడు నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు | : 44,840 |



వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కిట్టును బాలింతకు పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

**హెచ్‌బీ శాతం పెరిగింది**



ప్రభుత్వం అందించే పౌష్టికాహారం తినడం వల్ల హెచ్‌బీ శాతం పెరిగింది. మొదట్లో హెచ్‌బీ 7 ఉండేది. ప్రస్తుతం 9.5శాతం హెచ్‌బీ ఉందని రక్తపరీక్షలో తేలింది. సీఎం జగన్‌మోహన్ రెడ్డి మంచి కార్యక్రమం అమలు చేస్తున్నారు.

–వంతాల గంగాభవాని, గర్భిణి. నడిమివీధి, పాడేరు మండలం

**రక్తహీనత నివారణకు ఎంతో మేలు**



వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ పథకం గిరిజన ప్రాంతాల్లో రక్తహీనత సమస్య నివారణకు ఎంతో మేలు చేస్తుంది. రక్తహీనత సమస్య ఉన్న గర్భిణులు, బాలింతలు, బరువు తక్కువ ఉన్న చిన్నారుల సంక్షేమంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాం.

–సూర్యలక్ష్మి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్



పౌష్టికాహారం తింటున్న గర్భిణులు, బాలింతలు

## న్యూస్‌రీల్

### నేడు జాబ్‌మేళా

అరకులోయ రూరల్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎంపికైన వారికి విశాఖపట్నం సినర్జీస్ క్యాస్టింగ్స్ లిమిటెడ్ (దువ్వాడ)లో ఏడాది శిక్షణ ఉంటుందని, ఈ సమయంలో రూ.11 వేల వేతనం, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యాలు ఉంటాయన్నారు. ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, మెకానికల్, డీజిల్, మోటార్ మెకానిక్, పెయింటర్స్ రంగంలో శిక్షణ కల్పిస్తారన్నారు. ఆసక్తి గల యువతీ యువకులు ఉదయం 10 గంటలకు హాజరుకావాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు 9493631959 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

### 6న గంగాలమ్మ జాతర

అడ్డతీగల: గిరిజనుల ఇలవేల్పు గంగాలమ్మ తల్లి జాతర మహోత్సవాన్ని వచ్చేనెల 6వ తేదీన నిర్వహించాలని నిర్ణయించినట్లు పవనగిరి క్షేత్ర వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య తెలిపారు. అమ్మవారికి ఐదుగురు పేరంటాళ్లు, గిరిజన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. అనంతరం 100 గ్రామాలకు చెందిన గిరిజన అర్చకులు మహిళలతో ఘటాలను ఊరేగింపుగా అడ్డతీగలలోని సోమాలమ్మ ఆలయానికి తీసుకువెళ్తారన్నారు. అక్కడ అమ్మవారికి ఘటాలను చూపి తిరిగి పవనగిరికి వస్తారన్నారు. పవనగిరి క్షేత్రం నుంచి పుట్టింటి చీర, సారె, మంగళ సూత్రాలు, పూజా సామగ్రి ఉచితంగా ఇస్తామని ఆయన తెలిపారు.

### వచ్చే నెల 30 నుంచి మత్స్య మాడుగులమ్మ ఉత్సవాలు



ఉత్సవ ఏర్పాట్లపై సమావేశమైన పెద్దలు

జి.మాడుగుల: ఏజెన్సీ ప్రజల ఆరాధ్యదైవం, మత్స్యరాస వంశీయుల ఇలవేల్పు మత్స్యమాడుగులమ్మ జాతర మహోత్సవాలు వచ్చేనెల 30 నుంచి మే రెండో తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు గ్రామ పెద్దలు నిర్ణయించారు. ఉత్సవ కమిటీని శనివారం ఏర్పాటుచేస్తామని గురువారం ఆలయ ఆవరణలో గ్రామస్తులు, వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మత్స్యరాస వరహాలరాజు, మాజీ ఎంపీపీ మత్స్యరాస వెంకటగంగరాజు, ఎం రామరాజు, ఉపాధ్యాయుడు ఎం.భగవాన్‌రాజు, జీసీసీ సేల్స్‌మేన్ ఎం సింహాచలంరాజు, ఎం రామూర్తిరాజు, గసాడి రెడ్డిబాబు, కల్యాణం, అలీఖాన్, వద్దాది శ్రీనివాసరావు, రిటైర్డు ఉద్యోగి తలారి మత్స్యయ్య, గణపతి, కొండబాబు పాల్గొన్నారు.

### ఘాట్ రోడ్డులో అడ్డంగా నిలిచిన లారీ

రాకపోకలకు అవస్థలు



పాడేరు ఘాట్‌లో రోడ్డుకు అడ్డంగా నిలిచిన లారీ

సాక్షి,పాడేరు: మైదాన ప్రాంతానికి వెళ్లే ప్రధాన ఘాట్‌రోడ్డులోని యేసు ప్రభువు విగ్రహం ఉన్న మలుపులో భారీ లారీ మళ్లీ సాంకేతిక కారణాలతో రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. మైదాన ప్రాంతం నుంచి లోడ్‌తో వస్తున్న భారీ వాహనం ఈ మలుపు ఎక్కలేక మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో మొరాయించి ఆగిపోయింది. బస్సులు, లారీలు, భారీ వాహనాలు ఇరువైపులా నిలిచిపోయాయి. కార్లు, జీపులు, ఆటోలు మాత్రమే రాకపోకలు సాగించాయి. ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ఆర్టీసీ అధికారులు ఇరువైపులా బస్సులను నిలిపి ప్రయాణికులను తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. లారీని అడ్డంగా తీసే పనులు కొనసాగుతున్నాయి.

# మాచ్‌ఖండ్‌లో పుష్ప-2 షూటింగ్?

- లొకేషన్లను నిర్ణయించిన అసిస్టెంట్ డైరెక్టర్లు
- ఏప్రిల్ రెండో వారం నుంచి చిత్రీకరణ జరిగే అవకాశం



మాచ్‌ఖండ్ పవర్ ప్రాజెక్టు వించ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పుష్ప సినిమా అసిస్టెంట్ డైరెక్టర్లు

సాక్షి, పాడేరు: అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన పాన్ ఇండియా మూవీ పుష్ప ప్రేక్షకులను ఎంతో అలరించింది. అప్పట్లో పుష్ప సినిమాలో పలు సన్నివేశాలను జిల్లాలోని మారేడుమిల్లి, సీలేరుతో పాటు ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లాలోని పలు ప్రాంతాల్లో చిత్రీకరించారు. ప్రస్తుతం పుష్ప-2 చిత్రం కోసం లొకేషన్లు చూసేందుకు ఆ చిత్ర అసిస్టెంట్ డైరెక్టర్లు, చిత్ర నిర్మాణ ప్రతినిధులు మూడు రోజుల నుంచి జిల్లా సరిహద్దు, ఒడిశాలోని అటవీ ప్రాంతాలను సందర్శిస్తున్నారు. ఒడిశాలోని కోరాపుట్ జిల్లా పరిధిలోని దట్టమైన అడవితో పాటు డుడుమా జలపాతం, మాచ్‌ఖండ్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి చెందిన వించ్ మార్గం, వ్యూపాయింట్లు, బలిమెల జలాశయానికి వెళ్లే సెలయేరు, అడవిలోని బొండా జాతి గిరిజన గ్రామాలను పరిశీలిస్తున్నారు. మాచ్‌ఖండ్‌లో పుష్ప-2కు సంబంధించి కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. దట్టమైన అటవీ ప్రాంతం, ప్రకృతి అందాలను వీడియో, ఫొటోల రూపంలో దర్శకుడు సుకుమార్, హీరో అల్లు అర్జున్‌లకు అందడంతో వారు కూడా ఇక్కడ అందాలకు ఫిదా అయినట్టు సమాచారం. ఏప్రిల్ మొదటి వారం నుంచి ఆంధ్రా సరిహద్దు, ఒడిశా ప్రాంతాల్లో పుష్ప-2 సినిమా షూటింగ్ జరిగే అవకాశాలున్నాయని తెలుస్తోంది.

# క్షయ రోగులకు ఉన్నత వైద్యం

- తగ్గుతున్న వ్యాధి తీవ్రత
- నేడు ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం

సాక్షి,పాడేరు: జిల్లాలో క్షయ వ్యాధిగ్రస్తుల సంఖ్య రోజురోజుకు తగ్గుతున్నట్టు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2003 ఏప్రిల్ 7న ప్రారంభించిన జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం మంచి ఫలితాలివ్వడంతో వ్యాధిని నియంత్రించగలిగింది. జిల్లాలో 11 ప్రభుత్వ ఆస్పత్రుల్లో టీబీ నిర్ధారణ పరీక్షా కేంద్రాలు పనిచేస్తున్నాయి. రెండు వారాలకు మించి దగ్గుతో కూడిన జ్వరం ఉన్న రోగులందరికి వైద్య ఆరోగ్యశాఖ టీబీ పరీక్షలు నిర్వహిస్తోంది. అవసరమైతే ఉచితంగా మందులు అందజేస్తోంది. జిల్లాలోని 22మండలాల్లో టీబీ నియంత్రణ కార్యక్రమాలను వైద్య ఆరోగ్యశాఖ విజయవంతంగా నిర్వహిస్తోంది.



పొగాకుతో చుట్ట తాగుతున్న ఆదివాసీ మహిళ

- మొదట్లో ఏజెన్సీలో క్షయ వ్యాధి కేసులు ఎక్కువగా నమోదయ్యేవి. పొగాకుతో తయారుచేసే చుట్ట, బీడీ, సిగరెట్, తంబాకు వినియోగం వల్లే క్షయ సోకుతుంది. ప్రధానంగా వీటిని గిరిజనులు ఎక్కువగా వినియోగిస్తుంటారు. దీనిపై ప్రభుత్వ చేపట్టిన అవగాహన కార్యక్రమాలు వారిలో చైతన్యం తెచ్చాయి. క్రమేపీ వ్యాధి తీవ్రతను ప్రభుత్వాలు కట్టడి చేయగలిగాయి.
- 2015లో జిల్లా వ్యాప్తంగా 1106 టీబీ కేసులు నమోదుకాగా 2022 నాటికి 690కు తగ్గింది.



రోగికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ విశ్వేశ్వరనాయుడు

ఉన్నత వైద్యసేవలు అందుబాటులో ఉన్నందున వ్యాధి బారిన పడిన వారు సకాలంలో కోలుకుంటున్నారు.

- రాష్ట్ర ప్రభుత్వం రోగులకు పౌష్టికాహారం నిమిత్తం అందిస్తున్న రూ.500 నగదు ఎంతో ఉపశమనాన్ని ఇస్తోంది.

ఉండడంతో రోగులకు సకాలంలో కోలుకుంటున్నారు.రాష్ట్ర ప్రభుత్వం టీబీ రోగులకు ప్రతి నెల పౌష్టికాహారం నిమిత్తం రూ.500 నగదును వారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తుంది.

# గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఉత్తర్వులు

మారేడుమిల్లి: స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల ఆశ్రమ పాఠశాల(పీటీజీ) ప్రిన్సిపాల్ ఎస్‌కే అహ్మద్ అలీషా సస్పెండ్ చేస్తూ రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి. గురుకుల పాఠశాలలో ఏడోవ తరగతి చదువుతున్న విద్యార్థి సాదల లోకేశ్వరరెడ్డి గత ఏడాది సెప్టెంబర్ ఆరున అనారోగ్యానికి గురయ్యాడు. అతనిని స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్య సేవల నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి వైద్యులు రిఫర్ చేశారు. అయితే తల్లిదండ్రులు ఒత్తిడి మేరకు అతనిని వారికి అప్పగించి స్వగ్రామమైన వై.రామవరం మండలం ఎడ్లకొండ గ్రామానికి పంపించారు. ఆ తరువాత ఏడవ తేదీన లోకేశ్వరరెడ్డి ఇంటి వద్ద మృతి చెందాడు. దీనిపై ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే విచారణకు ఆదేశించారు. విచారణలో భాగంగా అనారోగ్యంతో ఉన్న లోకేశ్వరరెడ్డిని వైద్యులు రంపచోడవరం రిఫర్ చేసినప్పటికీ అతనిని రంపచోడవరం ఆస్పత్రికి పంపించకుండా తల్లిదండ్రులకు అప్పగించిన కారణంగా ప్రిన్సిపాల్ అహ్మద్ అలీషాను సస్పెండ్ చేస్తూ ఐటీడీఏ పీవో ఉత్తర్వులు జారీ చేశారు. రంపచోడవరం ఏపీఆర్ పాఠశాలకు చెందిన టి. అరుణ కుమారికి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ వాచ్ ఏపీ అధ్యక్షుడు బాలు అక్కిస మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఆరోగ్యం బాగోలేనప్పుడు వారి బాధ్యతలు సంబంధిత ప్రిన్సిపాల్, వార్డెన్ తీసుకుని సకాలంలో వైద్య సేవలందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయాన్ని జాతీయ కమిషన్ దృష్టికి తీసుకువెళ్లినట్టు ఆయన పేర్కొన్నారు.

# 'ఆశా' కిరణం

- రహదారి నిర్మాణానికి వేతనం కేటాయింపు
- చిరుద్యోగి జీమ్మ పెద్ద మనసు



తోటగొడిపుట్టు గ్రామానికి రహదారి ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న ఆశా కార్యకర్త జీమ్మ

ముంచంగిపుట్టు: ఆంధ్రా– ఒడిశా రాష్ట్రాల సరిహద్దులో రహదారి లేక పడుతున్న ఇబ్బందులను చూసి గ్రామ ఆశా కార్యకర్త చలించిపోయింది. తనకు వచ్చే వేతనాన్ని వెచ్చించి రహదారిని నిర్మాణానికి ఉపక్రమించింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జోలాపుట్టు పంచాయతీ తోటగొడిపుట్టు గ్రామంలో వ్యవసాయ కుటుంబానికి చెందిన ఆశా కార్యకర్త జీమ్మ వేతనంగా వచ్చిన సొమ్ముతో మూడు కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఆమెకు నెలకు రూ.4 వేల వేతనం పొందుతోంది. గ్రామానికి సరియైన రహదారి లేదు. గర్భిణులను ఆస్పత్రికి తరలించేందుకు నిత్యం ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటోంది. కేవలం మూడు కుటుంబాలు మాత్రమే ఉన్నందున రహదారి నిర్మాణం సమస్యగా మారింది. దీంతో ఆమె దారి ఏర్పాటును తన భుజస్కంధాలపై వేసుకుంది. కొండప్రాంతం కావడంతో బండరాళ్ల తొలగింపు కష్టంగా మారింది. వెంటనే ఓ ప్రైవేట్ పొక్లెయిన్‌ను సమకూర్చి బండరాళ్ల తొలగింపు చేపట్టింది. ఇందుకు గాను గంటకు రూ.1350 చొప్పున అద్దె చెల్లిస్తోంది. ఈ సందర్భంగా ఆశా కార్యకర్త జీమ్మ మాట్లాడుతూ రహదారి నిర్మాణానికి సుమారు రూ.50 వేల వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉందని తెలిపింది. ప్రతినెలా ప్రభుత్వం తనకు చెల్లిస్తున్న వేతన మొత్తాన్ని పొదుపు చేసి ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపింది. రహదారి ఏర్పడితే మిగతా సౌకర్యాలు తమ చెంతకు వస్తాయని ఆమె పేర్కొంది. రహదారిని పక్కారోడ్డుగా మార్చేందుకు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, కలెక్టర్ సుమిత్‌కుమార్ చర్యలు తీసుకోవాలని ఆమె కోరుతోంది. గ్రామంలో ప్రధాన సమస్య పరిష్కారానికి సొంత నిధులు వెచ్చించి చొరవ చూపిన ఆమెను పలువురు అభినందించారు.

### 26న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఎటపాక: స్థానిక ప్రభుత్వ ఆదర్శ ఆశ్రమ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 26న పూర్వవిద్యార్థుల మహా సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. కళాశాల ప్రారంభమై 37 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఇప్పటి వరకు కళాశాలలో చదువుకున్న విద్యార్థులంతా ఈ మహా సమ్మేళనానికి హాజరుకావాలని ఆయన కోరారు.

# అలంకరణ చేపల ఉత్పత్తితో ఉపాధి అవకాశాలు

రంపచోడవరం: అలంకరణ చేపల ఉత్పత్తితో మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చని కేవీకే కోఆర్డినేటర్,ప్రధాన శాస్త్రవేత్త డా.లలితాకామేశ్వరి సూచించారు. పందిరిమామిడి కేవీకేలో గురువారం అలంకరణ చేపల ఉత్పత్తి, యాజమాన్య పద్ధతులపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్వేరియం నిర్మాణం, వాటి అమరిక, వాటిలో పెంచే చేపల ఉత్పత్తి రంగంలో మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఇళ్లల్లో రంగుల చేపల పెంపకం ప్యాషన్‌గా మారిందన్నారు.మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ రమేష్, కేవీకే శాస్త్రవేత్త లు డా. వీరాంజనేయులు, ఆదర్శ, చిరంజీవి, రాజశేఖర్, ప్రవీణ్‌బాబు, అధ్యాపకుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త వీరాంజనేయులు

### దూరవిద్య పరీక్ష ఫలితాల విడుదల

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం పరిధిలో 11 పీజీ కోర్సుల మొదటి, రెండవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల చేసినట్లు కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వర రావు తెలిపారు. ఎంఏ ఇంగ్లిష్, హిందీ, తెలుగు, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, ఫిలాసఫీ, మ్యాథ్‌మెటిక్స్, ఎంజేఎంసీ కోర్సుల ఫలితాలను www.ndhrauniversitysde.com పొందుపరిచినట్లు పేర్కొన్నారు.

# ఐఐఎం విద్యార్థులందరికీ ఇంటర్న్‌షిప్

ఏయూక్యాంపస్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం విద్యార్థులకు శత శాతం సమ్మర్ ప్లేస్‌మెంట్స్ లభించాయి. అత్యధిక స్టైఫండ్‌గా రెండు నెలలకు రూ 2.5లక్షలు సాధించారు. సగటు స్టైఫండ్ రూ.79.88 వేలు. 110 సంస్థలకు మొత్తం 272 మంది విద్యార్థులూ ఎంపికయ్యారు. ఐటీ ఆధారిత రంగాలకు 22 శాతం, ఎఫ్‌ఎస్‌ఐ రంగాలకు 19 శాతం, కన్సల్టింగ్‌లో 12 శాతం, ఎఫ్‌ఎంసీజీలో 8 శాతం, మ్యానుఫ్యాక్చరింగ్‌లో 7 శాతం, ఫార్మా–హెల్త్‌కేర్ రంగంలో 7 శాతం, ఎడ్యుటెక్ రంగంలో 7శాతం, రియల్ ఎస్టేట్–నిర్మాణ రంగంలో 4 శాతం మంది నియామకం అయినట్లు ఐఐఎంవీ సంచాలకుడు ఆచార్య ఎం.చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు.



ఇంటర్న్‌షిప్ సాధించిన విద్యార్థులు

## క్లుప్తంగా

### అప్పన్నను దర్శించుకున్న గిరిజన పూజారులు



సింహగిరిపై గిరిజన పూజారులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పలువురు గిరిజన పూజారులు దర్శించుకున్నారు. ఆ జిల్లాలోని పలు గ్రామాల్లో విశ్వ హిందూ పరిషత్ ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి ఆలయాల్లో వీరంతా పూజారులుగా ఉన్నారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లాలోని టీటీడీ నిర్మిస్తున్న 163 ఆలయాల్లో కూడా వీరంతా పూజారులుగా విధులు నిర్వహించనున్నారు. ఈ తరుణంలోనే శుక్రవారం భీమిలిలో జరిగిన ఒక సమావేశానికి వచ్చిన వీరంతా తొలుత సింహాచలంలో స్వామివారిని దర్శించుకున్నారు. సింహాచలం దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, అల్లూరి జిల్లాలోని ఆలయాల నిర్మాణాల పర్యవేక్షకుడు రాంబాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ మురళి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### సంతల్లో సౌకర్యాలు

నాబార్డ్ ఏజీఎం శ్రీనివాసరావు

చింతపల్లి రూరల్: మన్యంలో దుకాణాల నిర్వహణకు వీలుగా ప్రత్యేక షెడ్లు నాబార్డు సాయంతో నిర్మిస్తున్నామని నాబార్ట్ ఏజీఎం శ్రీనివాసరావు తెలిపారు. మండల కేంద్రంలో రూ.20.5 లక్షలతో నిర్మిస్తున్న దుకాణ నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. నాబార్డు నుంచి రూ.15లక్షలు, పంచాయతీ నుంచి రూ.5.50 లక్షలు కేటాయించినట్లు ఆయన తెలిపారు. ఇక్కడ జరుగుతున్న వారపు సంతలో 40 దుకాణాలను నిర్మిస్తున్నామన్నారు. మరుమూల ప్రాంతాల నుంచి సంతకు గిరిజనులు తీసుకువస్తున్న వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు వీలుగా ప్రత్యేక గోదాం నిర్మిస్తామన్నారు. ఇక్కడ తాగు నీరు, విద్యుత్ సౌకర్యం కూడా ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. గైరంపేట, రావణాపల్లి, పెదవలస ప్రాంతాల్లో గిరిజన వికాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సంతల్లో దుకాణ సముదాయాలు ఏర్పాటు చేశామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన వికాస్ డైరెక్టర్ సత్యనారాయణ, ఈవోపీఆర్డీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అప్పన్నకు శాస్త్రోక్తంగా స్వర్ణపుష్పార్చన



గరుడసేవ నిర్వహిస్తున్న పురోహిత్ అలంకారి సీతారామాచార్యులు, పాల్గొన్న భక్తులు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న ఉప ప్రధానార్చకుడు, ఉద్యోగులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి 8 గంటల వరకు స్వర్ణ పుష్పార్చనని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై వేంజేపచేశారు. 108 స్వర్ణ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళిని నిర్వహించారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, అర్చకుడు శ్రీకాంత్ తదితరులు ఈసేవను నిర్వహించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



నిత్యకల్యాణంలో యజ్ఞోపవీతం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

**వైభవంగా నిత్య కల్యాణం**

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30గంటల నుంచి 10.30గంటల వరకు శ్రీ వరాహ నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణమంపడంలోని వేదికపై వేంజేంప జేశారు. విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు ,ప్రసాదాన్ని అందజేశారు.

**ఘనంగా గరుడసేవ**

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వేంజేంపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజను నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్ ఈపూజలో పాల్గొన్నారు.

# కొలువుదీరిన దుర్గమాంబ



పరవాడ: ఈ.బోనంగి శివారు బొడ్డపువానిపాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ దుర్గమాంబ విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ ప్రారంభోత్సవ మహోత్సవం వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయాన్ని పూలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం శ్రీదుర్గమాంబను భక్తుల దర్శనార్థం గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం వేదపండితులు ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం నడుమ రేవతి నక్షత్రయుక్త, వృషభ లగ్నమందు ఉదయం 9.57 గంటలకు విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ దేవతకు భక్తులు పసుపు కుంకుమలు, సారే, చీరలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రారంభోత్సవంలో భాగంగా చిడతలు, తప్పెడుగుళ్ల, సాముగరిడిలు, నేల డ్యాన్సులు నిర్వహించారు. భారీ ఎత్తున బాణసంచాను కాల్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.



దుర్గమాంబను ఆలయంలో ప్రతిష్ఠించడానికి ఊరేగింపుగా తీసుకువెళుతున్న భక్తులు

**దుర్గమాంబను దర్శించుకొన్న నాయకులు**

గ్రామంలో కొలువుదీరిన శ్రీ దుర్గమాంబను ఈ.బోనంగి సర్పంచ్ బొడ్డపు శ్రీనివాసరావు, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పరవాడ జెడ్పీటీసీ పి.ఎస్.రాజు, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, ప్రముఖులు చుక్క రామునాయుడు, పైల జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, బొడ్డపు నూకరత్నం, బొడ్డపు వెంకటరమణ, బొడ్డపు చిన్నారావు, మేడిశెట్టి బాలాజీ నాయుడు, పలువురు గ్రామ పెద్దలు అమ్మవారిని దర్శించుకొన్నారు. ఆలయ ప్రారంభోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

# మోదకొండమ్మకు వెండి కిరీటం



అమ్మవారికి అలంకరించిన వెండి కిరీటం

మాడుగుల రూరల్: మండలంలోని కె.జె.పురంలో మోదకొండమ్మ అమ్మవారికి ఆ గ్రామానికి చెందిన బొడ్డేడ సురేష్, భారతి దంపతులు రూ.2.48 లక్షలతో తయారు చేయించిన వెండి కిరీటాన్ని గురువారం సమర్పించారు. మూడు కిలోల బరువు గల ఈ కిరీటాన్ని గ్రామంలో ఊరేగించిన అనంతరం అమ్మవారికి అలంకరించారు. గతంలో సురేష్ కుటుంబ సభ్యులు అమ్మవారికి వెండి బొట్టు, ముక్కుపుడక, హారం, వడ్డాణం సమర్పించారు.

# ఆధ్యాత్మిక శోభ

వైభవంగా అమ్మవార్ల జాతర



మత్స్యదేవత జాతరలో ఘటాల ఊరేగింపులో భక్తులతో జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి



ముత్యాలమ్మ తల్లి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

చింతపల్లి: మండల కేంద్రంలోని ముత్యాలమ్మ ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చండి పారాయణ, చండి హోమం, నవగ్రహ శాంతి పూజలు జరిపారు. కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో సారె తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. భక్తులు గోత్ర నామాలతో యాగం చేయించుకోన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనూషదేవి, ఆలయ కమిటీ సభ్యులు వీరేంద్ర, నాగభుషణం, నాయుడు, బేతాళుడు తదితరులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు.

**వైభవంగా మత్స్యదేవత ముగింపు ఉత్సవం**

3మండలంలో సొలభం పంచాయతీ ఎస్ కొత్తూరు, పెద్దపాలం, వనభరంగిపాడు, కొత్తకుండలు గ్రామ ప్రజల ఆరాధ్యదైవం మత్స్యదేవత జాతర ముగింపు ఉత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఆయా గ్రామాల నుంచి భక్తులు ఘటాలను వనరంగిపాడు గ్రామ సమీపంలో గల మత్స్యదేవత ఆలయ సన్నిధికి డప్పుడు వాయిద్యాల నడుమ సర్పంచ్ ఐసరం హనుమంతరావు ఆధ్వర్యంలో భారీ ఊరేగింపుతో తీసుకువచ్చారు. మత్స్యదేవత ఆలయంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీ ఎం వెంకటగంగరాజు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వారు ఘటాల ఊరేగింపు ఉత్సవంలో పాల్గొన్నారు. మండల స్థాయి వాలీబాల్ క్రీడా విజేతలైన మగతపాలెం టీమ్‌కు ప్రథమ బహుమతి కింద రూ.10,016, షీల్డు, తాసరబయలు టీమ్‌కు ద్వితీయ బహుమతి కింద రూ.5,016, షీల్డులను అందజేశారు. ఉత్సవాలు సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

# 27న నిధి ఆప్‌కే నికత్

పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ వైడీ శ్రీనివాస్

రాజమహేంద్రవరం రూరల్: ఉద్యోగులు భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 27న నిధి ఆప్‌కే నికత్–జిల్లా ఔట్‌రీచ్ ప్రోగ్రాం జరగనుంది. పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ వైడీ శ్రీనివాస్ ఈ విషయం తెలిపారు. పూర్వ ఉభయ గోదావరి జిల్లాల ఖాతాదారులు ఈసేవలు వినియోగించుకోవచ్చునన్నారు. భవిష్యనిధి అంతిమ ఉపసంహరణ, ఖాతాల బదిలీ తదితర అంశాలకు సంబంధించి పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు. తూర్పు గోదావరిజిల్లా పరిధిలో పెద్దాపురంలో శ్రీలలితా ఎంటర్‌ప్రైజస్ ఇండస్ట్రీస్ (ప్రై)లిమిటెడ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం వేదాంత లిమిటెడ్, అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ రిసోర్స్‌సెంటర్, కాకినాడ జిల్లా పరిధిలో కాకినాడ ఈపీఎఫ్‌వో జిల్లా కార్యాలయం, ఏలూరు జిల్లా పరిధి ఏలూరు సీఆర్ రెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అటానమస్ కాలేజ్ ఆడియో విజువల్ హాల్, పశ్చిమగోదావరి జిల్లా పరిధి భీమవరం ఈపీఎఫ్‌వో జిల్లా కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లో పెన్షన్ అర్హత, లెక్కించడం, క్లెయిమ్, ఉపసంహరణ, స్కీమ్ సర్టిఫికెట్, ఈ నామినేషన్, డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్, ఇతర సంబంధిత సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈపీఎఫ్‌వో సభ్యులు, పింఛనుదారులు, ఎస్టాబ్లిష్మెంట్లు, కొత్తగా కవర్ చేసిన ఎస్టాబ్లిష్మెంట్లు ఈఅవుట్‌రీచ్ ప్రోగ్రామ్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. నిధి అప్‌కే నికత్ అని పేర్కొంటూ తమ ఫిర్యాదులను అందజేయవచ్చని అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ వైడీ శ్రీనివాస్ కోరారు.

# ఘనంగా గండి పోశమ్మ జాతర ప్రారంభం



దేవీపట్నం: పూడిపల్లి పంచాయతీ గొందూరులో కొలువైన మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో పాటు గరగల నృత్యం, భజన కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి జాతరను తిలకించేందుకు సుమారు వెయ్యిమంది భక్తులు హాజరయ్యారు. వచ్చిన వారందరికీ ఆలయ సిబ్బంది అన్నసమారాధన ఏర్పాటుచేశారు. ఇందుకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది వైద్యశిబిరం నిర్వహించారు. ఐదు రోజులపాటు నిర్వహించే ఈ జాతర మహోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూసాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈవో జి.వి లక్ష్మీకుమార్ తెలిపారు.

# నేడు సెలబ్రిటీ క్రికెట్ సెమీస్ మ్యాచ్‌లు



అఖిల్

విశాఖ స్పోర్ట్స్: సెలబ్రిటీ క్రికెట్ లీగ్(సీసీఎల్) సెమీస్ ఫైనల్ పోటీలు శుక్రవారం వైఎస్సార్ స్టేడియంలో జరగనున్నాయి. తొలి సెమీస్ మధ్యాహ్నం 2.30 గంటలకు భోజ్‌పురి దంబాగ్–ముంబై హీరోస్ జట్ల మధ్య జరగనుంది. మరో సెమీస్‌లో రాత్రి 7 గంటలకు కర్నాటక బుల్‌డోజర్స్ జట్టుతో తెలుగు వారియర్స్ జట్టు తలపడనుంది. ఫైనల్స్ శనివారం రాత్రి 7 గంటలకు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరగనుంది. తెలుగు వారియర్స్ జట్టు కెప్టెన్‌గా అఖిల్, మెంటర్‌గా వెంకటేష్ వ్యవహరించనున్నారు. అంబాసిడర్లుగా రెజీనా, ప్రణీత, ఆదాశర్మ ఉన్నారు. జట్టులో సచిన్‌జోషి, అశ్విన్, ధరమ్, ఆదర్స్, నిఖిల్, తరుణ్, విశ్వ, ప్రిన్స్, సుశాంత్ ఆల్‌రౌండర్లుగా రాణిస్తుండగా నంద, సామ్రాట్ బంతితో అలరించనున్నారు. టీ20 మ్యాచ్ అయినా తొలిసారిగా పదేసి ఓవర్లు రెండు ఇన్నింగ్స్‌లుగా పోటీలు జరుగుతున్నాయి. ఈ మ్యాచ్‌లు జీటీవీ ప్రసారం చేయనుంది.

# జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

- ముగ్గురు విద్యార్థులకు అభినందనలు



హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పాయకరావుపేట: కృష్ణా జిల్లా గన్నవరంలో జనవరి 13, 14వ తేదీల్లో జరిగిన 37వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలుర పోటీల్లో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు శ్రీప్రకాష్ విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్ మూర్తి గురువారం తెలిపారు. శ్రీప్రకాష్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు రాజాన కుమార్, లాలం దిలీప్, దొండా రేవంత్ ఈ నెల 27 నుంచి 31 వరకు అసోం రాష్ట్రం గౌహతిలో జరిగే 37వ జాతీయ స్థాయి సబ్ జూనియర్స్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నారని పేర్కొన్నారు. వీరిని విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, ప్రధానోపాధ్యాయుడు డి.వి. శ్రీనివాస్, కోచ్‌లు సురేష్, బాలరాజు, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

# ఉత్తమ ప్రదర్శనగా 'కొత్తపరిమళం'

అనకాపల్లిటౌన్: స్థానిక వి.వి.రమణ రైతుభారతి ఓపెన్ ఆడిటోరియంలో జ్యోతిసరళ స్మారక కళా పరిషత్, 1975 ఎంహెచ్ స్కూల్ పూర్వవిద్యార్థుల సహకారంతో నిర్వహించిన ఉమ్మడి ఏపీ ద్వితీయ ఆహ్వాన నాటిక పోటీలు బుధవారం రాత్రితో ముగిశాయి. ఈ పోటీల్లో సర్వాణి గ్రామీణ గిరిజన సేవాసంఘం బొరువంకవారు ప్రదర్శించిన 'కొత్తపరిమళం' నాటిక ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది. అమృతలహరి థియేటర్ ఆర్ట్స్ గుంటూరు వారు ప్రదర్శించిన 'నాన్ననేనొచ్చేస్తా' నాటికకు ద్వితీయ బహుమతి, నటరాజ్ ఆర్ట్స్ క్రియేషన్స్ వైజాగ్ వారు ప్రదర్శించిన 'ది లాస్ట్‌జడ్జిమెంట్' నాటికకు తృతీయ బహుమతి లభించాయి.

# 'టెన్త్ విద్యార్థులకు ఉచిత ప్రయాణం'

అనకాపల్లిటౌన్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్ 3 నుంచి 18 వరకు పదోతరగతి పరీక్షలు వ్రాసే విద్యార్థులు వారి స్వగృహం నుంచి పరీక్షా కేంద్రం వరకూ హాల్ టికెట్స్ చూపించి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని జిల్లా ప్రజా రవాణా శాఖ(ఆర్టీసీ) అధికారిణి కె.పద్మావతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని డిపోల్లో విధులు నిర్వహిస్తున్న తమ సిబ్బందికి ఈ మేరకు ఆదేశాలు జారీ చేసినట్టు పేర్కొన్నారు.

పరీక్ష సమయంలో మాత్రమే విద్యార్థులు హాల్‌టికెట్ చూపించి ఆర్టీసీ బస్‌లో ప్రయాణించవచ్చన్నారు.

# స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్‌లో కూలిన కోక్ బకెట్

గాజువాక: స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ ఐదో బ్యాటరీలో కోక్ తీసుకువెళ్తున్న బకెట్ కూలిపోయింది. ఈ సంఘటనలో స్వల్ప ఆస్తినష్టం సంభవించగా అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణనష్టం కలగలేదు. ప్రత్యక్షసాక్షుల కథనం మేరకు.. గురువారం విభాగంలో ఎత్తులో ఉన్న ఐదో సీడీసీపీకి బకెట్‌లో వేడిగా ఉన్న కోక్‌ను తరలిస్తున్నారు. కొంత ఎత్తుకు వెళ్లేసరికి బకెట్‌కు ఉన్న రోప్ తెగిపోయింది. దీంతో బకెట్ కింద పడి ధ్వంసమైంది. అందులో ఉన్న హాట్ కోక్ కిందకు పడిపోయింది. దీంతో ఆ ప్రాంతంలో మంటలు వ్యాపించాయి. వెంటనే సీఐఎస్ఎఫ్ ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. బ్యాటరీలో మొత్తం ఐదు బకెట్‌లు ఉండటంతో ఉత్పత్తికి అంతరాయం కలగలేదు. కింద పడిన కోక్‌ను కన్వేయర్ ద్వారా ఉత్పత్తి ప్రక్రియకు పంపనున్నట్టు విభాగం అధికారుల తెలిపారు.

# చిరుధాన్యాలతో ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్ ఉషారాణి

అనకాపల్లిటౌన్ : చిరుధాన్యాలతో మంచి ఆరోగ్యం లభిస్తుందని, వీటి వినియోగం ఇప్పుడు బాగా పెరిగిందని స్త్రీ శిశు సంక్షేమశాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ జి.ఉషారాణి తెలిపారు. చిరుధాన్యాల పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా స్థానిక చిన్నవీధి జార్జిస్కూల్ వద్ద గురువారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వచ్చేనెల 3వ తేదీ వరకూ పోషణ పక్వాడ కార్యక్రమాలు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. సజ్జలు, జొన్నలు, కొర్రలు, రాగులు, అరికెలతో తయారు చేసే పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలను ఆమె రుచిచూశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి సీడీపీవో పి.ప్రభావతి, సూపర్‌వైజర్ నిర్మల పాల్గొన్నారు.

### కె.కె.లైన్‌లో పలు రైళ్లు రద్దు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధి మల్లిగుడ–చత్రిపుట్ సెక్షన్ పరిధిలో జరుగుతున్న భద్రత పనుల కారణంగా కె.కె.లైన్‌లో ప్రయాణించే పలు రైళ్లను శుక్ర, శని వారాల్లో రద్దు చేశారు. ప్రయాణికులు ఈ మార్పులు గమనించి సహకరించాలని వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి కోరారు.

- ఈ నెల 24న విశాఖపట్నం–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ రద్దు.
- ఈ నెల 25న కిరండూల్–విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ రద్దు.
- ఈ నెల24న విశాఖపట్నం–కోరాపుట్ (18512) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రద్దు.
- ఈ నెల 24న కోరాపుట్– విశాఖపట్నం (18513) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రద్దు.

### రేపు జాబ్‌మేళా

మురళీనగర్: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కంచరపాలెం ప్రభుత్వ ఉపాధి కార్యాలయం (క్లరికల్) ప్రాంగణంలో శనివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పనాధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయి కృష్ణ చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటలకు హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, పొలగాని సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, స్టీల్ సిటీ సెక్యూరిటీ లిమిటెడ్, క్లోవ్ టెక్నాలజీస్, పేజెస్ సంస్థ, ట్రస్టు సర్వీసెస్, సువర్ణభూమి సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపిక జరుగుతుందన్నారు.

# సముద్ర తీరం.. పరిశుభ్రం

'సాక్షి'మీడియా ఆధ్వర్యంలో ఆర్.కె.బీచ్ క్లీన్



కార్యక్రమంలో పాల్గొన్న 'సాక్షి' సిబ్బంది

బీచ్‌రోడ్డు: ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టి.. పర్యావరణాన్ని కాపాడుకుందామని 'సాక్షి' మీడియా విశాఖపట్నం బ్రాంచ్ మేనేజర్ బి.వి.ఎస్.ఎస్.చంద్రరావు పిలుపునిచ్చారు. 'సాక్షి'పత్రిక 15వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఆర్కే.బీచ్‌లో బీచ్ క్లీన్ కార్యక్రమం జరిగింది. ఎడిటోరియల్, రిపోర్టింగ్, అడ్మినిస్ట్రేటివ్, యాడ్స్, సర్క్యులేషన్, టీవీ తదితర విభాగాలకు చెందిన సిబ్బంది బీచ్‌రోడ్డులోని కాళీమాత ఆలయం ఎదురుగా ఆర్.కె.బీచ్‌లో చెత్త, వ్యర్థాలను ఏరివేసి.. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందికి అందజేశారు. పరిపాలన రాజధాని కాబోతున్న విశాఖ నగరాన్ని పరిశుభ్రం ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పిలుపునిచ్చారు.



తీరంలో చెత్త తొలగిస్తున్న దృశ్యం